

వలంటీర్లతో వైసీపీ కార్పొరేటర్ సమావేశం

- అడ్డుకున్న టీడీపీ, జనసేనన నాయకులు
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం
- పోలీసుల రాకతో జారుకున్న వలంటీర్లు



వలంటీర్లతో సమావేశమైన వైసీపీ కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి

పరవాడ, మార్చి 22: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ వైసీపీకి చెందిన జీవీఎంసీ 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి శుక్రవారం దేశపాత్రునిపాలెం శివారునున్న తన నివాసంలో వలంటీర్లతో సమావేశమయ్యారు. సుమారు 20 మంది వలంటీర్లతో పాటు వైసీపీ నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకుని టీడీపీ, జనసేన నాయకులు పిళ్లా శివకృష్ణ, అమరపిన్ని గోపీ, పిల్లా మధుసూదన్ తదితరులు అక్కడకు చేరుకున్నారు. ఫొటోలు, వీడియోలు తీస్తుండగా వైసీపీ నాయకులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. ఫొటోలు, వీడియోలు తొలగించాలని లేకుంటే, అక్కడి నుంచి కదలనిచ్చేది లేదని వారిని దిగ్బంధించారు. దాంతో కొంతమంది ఫొటోలు, వీడియోలు డిలీట్ చేశారు. అక్కడి నుంచి పరవాడ సీఐకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. సీఐ బాలసూర్యారావు తన సిబ్బందితో కార్పొరేటర్ ఇంటికి చేరుకున్నారు. విషయాన్ని గమనించిన వలంటీర్లు అక్కడనుంచి జారుకున్నారు. కార్పొరేటర్ నిర్వహించిన సమావేశానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఉంటే ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని, రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు.

'వైసీపీ గెలుపునకు వలంటీర్లు కృషి చేయాలి'

వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు వలంటీర్లు కష్టపడి పనిచేయాలని కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి సూచించారు. తమ పరిధిలోగల 50 కుటుంబాలకు చెందిన వారితో వైసీపీకి ఓటు వేయించే బాధ్యత వలంటీర్లపై ఉందని కార్పొరేటర్ స్పష్టంగా చెప్పారని టీడీపీ జనసేన నేతలు తెలిపారు.

వైసీపీ అరాచకం

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పలురకాల ప్రయత్నాలు
- చోడవరంలో చీరల పంపిణీకి ప్రయత్నం
- వలంటీర్లతో 77వ వార్డు వైసీపీ కార్పొరేటర్ సమావేశం
- కన్నూరుపాలెంలో ఉపాధి కూలీలతో వైసీపీ నేతలు సమావేశం
- వైసీపీ ఎమ్మెల్యే సభలో ఆలయ పూజారి

అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులు, బెదిరింపులతో ఐదేళ్లపాటు పాలన సాగించిన వైసీపీ నేతలు.. వచ్చే ఎన్నికల్లో కూడా గెలుపొందాలన్న ఉద్దేశంతో అడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నికల నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నానా రకాలుగా యత్నిస్తున్నారు.

చోడవరంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ భార్య, స్థానిక జడ్పీటీసీ సభ్యురాలి భర్త కలిసి ఓటర్లకు పంచేందుకు తీసుకువెళుతున్న చీరలను ఎలక్షన్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తమ కుటుంబంలో శుభకార్యం కోసం తీసుకువెళుతున్నట్టు వైసీపీ నాయకులు నమ్మించేందుకు యత్నించినప్పటికీ, విచారణలో తేల్చుకోవాలని అధికారులు స్పష్టంచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవీఎంసీ 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి శుక్రవారం దేశపాత్రునిపాలెం శివారునున్న తన నివాసంలో వలంటీర్లతో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు వలంటీర్లు కష్టపడి పనిచేయాలని సూచించారు. కశింకోట మండలం కన్నూరుపాలెం ఉపాధి హామీ పథకం వీఆర్‌పీ చిటికల నరసింగరావు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారంటూ గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు 'సీ-విజిల్' యాప్‌లో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దేవదాయ శాఖ నుంచి గౌరవ వేతనం తీసుకుంటున్న ఓ ఆలయ పూజారి, వైసీపీ ఎమ్మెల్యే నిర్వహించిన సభలో పాల్గొన్నారు. దీనిపై టీడీపీ నాయకులు నర్సీపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.

వైసీపీ సభలో ఆలయ పూజారి

- దేవదాయ శాఖ నుంచి గౌరవ వేతనం తీసుకుంటూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన
- ఆర్డీవోకు టీడీపీ నాయకులు ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఏఎల్‌పురంలో నిర్వహించిన వైసీపీ సభలో పాల్గొన్న లింగంపేట నూకాలమ్మ ఆలయ పూజారి గోలకొండ త్రిమూర్తులు (సర్కిల్‌లో వున్న వ్యక్తి)

కృష్ణాదేవిపేట, మార్చి 19 : దేవదాయ శాఖ నుంచి గౌరవ వేతనం తీసుకుంటున్న ఓ ఆలయ పూజారి, వైసీపీ నిర్వహించిన సభలో పాల్గొన్నారు. ఈ వ్యవహారంపై టీడీపీ నాయకులు నర్సీపట్నం ఆర్డీవో జయరామ్‌కు ఫిర్యాదు చేశారు.

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ శుక్రవారం గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో వైసీపీలో కొత్తవారి చేరికల సందర్భంగా సభను ఏర్పాటు చేశారు. లింగంపేట గ్రామంలో దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న నూకాలమ్మ ఆలయ పూజారి గోలకొండ త్రిమూర్తులు కూడా ఈ సభలో పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో వున్నందున ప్రభుత్వం నుంచి జీతం/ వేతనం/ గౌరవభృతి పొందుతున్న వ్యక్తులు ఎవరూ రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఎన్నికల ప్రచారం వంటి కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. కానీ లింగంపేట నూకాలమ్మ ఆలయ పూజారి త్రిమూర్తులు మాత్రం ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, వైసీపీ ఎమ్మెల్యే నిర్వహించిన సభలో పాల్గొన్నారు. దీనిపై లింగంపేట గ్రామ మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, టీడీపీ అనుబంధ టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గోలకొండ శ్రీకాంత్, నర్సీపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి, వైసీపీ సభలో పాల్గొన్న లింగంపేట నూకాలమ్మ ఆలయ పూజారి త్రిమూర్తులుపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కన్నూరుపాలెంలోని ఒక మామిడితోటలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు. చిత్రంలో వీఆర్‌పీ చిటికల నరసింగరావు (వృత్తంలోని యువకుడు)

ఉపాధి కూలీలతో వైసీపీ నేతలు సమావేశం

- సహకరించిన కన్నూరుపాలెం వీఆర్‌పీ
- 'సీ-విజిల్' యాప్‌లో ఎన్నికల సంఘానికి స్థానికులు ఫిర్యాదు

కశింకోట, మార్చి 22: మండలంలోని కన్నూరుపాలెం ఉపాధి హామీ పథకం వీఆర్‌పీ చిటికల నరసింగరావు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారంటూ గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు శుక్రవారం 'సీ-విజిల్' యాప్‌లో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. ఈ నెల 20వ తేదీన కన్నూరుపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రాంతానికి వైసీపీ నాయకులు.. జడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ కరక సోమినాయుడు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ భార్య నివేదిత, తదితరులు వెళ్లారు. పనులు చేస్తున్న కూలీలను సమీపంలోని మామిడి, జీడిమామిడి తోటల్లోకి రప్పించి సమావేశం ఏర్పాటు చేశారు. వీఆర్‌పీ చిటికల నరసింగరావు సహకారంతోనే వైసీపీ నాయకులు, ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. దీంతో కొంతమంది స్థానికులు ఫొటోలతో సహా ఆధారాలను సేకరించి 'సీ-విజిల్' యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి, వీఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రదేశం ఎన్నికల ప్రచారం చేయడంపై ఎంపీడీవో శేషుబాబును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఉపాధి కూలీలు ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతున్నందున, ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో ఎన్నికల ప్రచారం, కూలీలతో సమావేశాలు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు. కన్నూరుపాలెంలో వీఆర్‌పీ చిటికల నరసింగరావు ఆధ్వర్యంలో వైసీపీ నేతలు ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేసిన విషయం తన దృష్టికి రాలేదని చెప్పారు.

చీరల పంపిణీకి వైసీపీ నేతల యత్నం

అడ్డుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్... 46 చీరలు, 3 లంగా ఓణీలు స్వాధీనం

- జడ్పీటీసీ సభ్యురాలి భర్త శ్రీకాంత్‌పై కేసు నమోదు, కారు సీజ్
- అదే వాహన శ్రేణిలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ భార్య



తనిఖీల సందర్భంగా అక్కడ ఉన్న విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ భార్య



జడ్పీటీసీ సభ్యురాలి భర్త శ్రీకాంత్ వాహనంలో పట్టుబడిన చీరలు

చోడవరం, మార్చి 22: ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అధికార పార్టీ నాయకులు నానా రకాలుగా యత్నిస్తున్నారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో ఓటర్లకు పంచేందుకు వైసీపీ నేతలు తీసుకువెళుతున్న చీరలను శుక్రవారం ఎలక్షన్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు కరణం ధర్మశ్రీ భార్య ఒక వాహనంలో, జెడ్పీటీసీ సభ్యురాలు మారిశెట్టి విజయ భర్త శ్రీకాంత్, తదితరులు మరో వాహనంలో శుక్రవారం ఉదయం పట్టణంలోని పెదబజారువీధిలో గల ఓ వ్యాపారి ఇంటికి బయలుదేరారు. ముందుగా అందిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి డి.సురేఖ, ఇతర సిబ్బంది...వైసీపీ నేతల వాహనాలను అడ్డుకుని తనిఖీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలి భర్త శ్రీకాంత్ కారులో ఉన్న 46 చీరలు, 3 లంగా ఓణీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తమ కుటుంబంలో శుభకార్యం కోసం తీసుకువెళుతున్నట్టు వైసీపీ నాయకులు నమ్మించేందుకు యత్నించినప్పటికీ, విచారణలో తేల్చుకోవాలని అధికారులు స్పష్టంచేశారు. అనంతరం వాటిని పోలీసులకు అప్పగించారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు తీసుకువెళుతున్న చీరలను స్వాధీనం చేసుకోవడంతో పాటు శ్రీకాంత్‌కు చెందిన కారును సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. కాగా ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే భార్య ఇతర వైసీపీ నాయకులు ఉన్నప్పటికీ, వారిని వదిలేయడాన్ని విపక్ష నేతలు తప్పుపడుతున్నారు. పట్టపగలే ఓటర్లకు తాయిలాలు పంచేందుకు అధికార పార్టీ నాయకులు బరితెగించడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

దుప్పితూరులో పట్టపగలు చోరీ

- తాళం వేసి ఉన్న ఉపాధి కూలీ ఇంటికి కన్నం వేసిన దొంగలు
- ఐదు తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.70 వేల నగదు అపహరణ



బంగారం, వెండి, నగదు చోరీకి గురైన బీరువాను పరిశీలిస్తున్న సీఐ బుచ్చిరాజు

అచ్యుతాపురం, మార్చి 22: మండలంలోని దుప్పితూరులో శుక్రవారం మధ్యాహ్నం ఒక ఇంట్లో దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో వున్న బంగారం, వెండి, రూ.70 వేల నగదు అపహరించుకుపోయారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ బుచ్చిరాజు అందించిన వివరాలిలా వున్నాయి. దుప్పితూరుకి చెందిన భార్యాభర్తలు ప్రగడ రమణ, సన్యాసమ్మ శుక్రవారం ఉదయం గ్రామ పరిధిలోని చెరువులో ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటలకు సన్యాసమ్మ భోజనానికని ఇంటికి వచ్చింది. తలుపులు తీసి వుండడంతో ఆందోళన చెంది ఇంట్లోకి వెళ్లి చూసింది. బీరువా తలుపులు తీసి వున్నాయి. ఇంట్లో వస్తువులు చెల్లా చెదురుగా పడిఉన్నాయి. బీరువాలో వుంచిన ఐదు తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులు, రూ.70 వేల నగదు కనిపించలేదు. దీంతో వెంటనే భర్త రమణకు ఫోన్ చేసి, ఇంట్లో చోరీ జరిగినట్టు చెప్పింది. ఆయన ఇంటికి వచ్చి పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ బుచ్చిరాజు వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

బీఎన్ రోడ్డు మరింత ఛిద్రం

కొద్దిపాటి వర్షానికే గోతుల్లో చేరిన నీరు

- వాహనదారులు, ప్రయాణికులకు పెరిగిన కష్టాలు

బుచ్చెయ్యపేట, మార్చి 22: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఈ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టి మూడేళ్లు దాటినప్పటికీ పది శాతం పనులు కూడా పూర్తికాలేదు. రోడ్డు విస్తరణ సంగతి అటుంచి.. కనీసం గోతులైనా పూడ్చాలని నాలుగు మండలాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదు. చోడవరం, రోలుగుంట మండలాలతో పోలిస్తే బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల పరిధిలో బీఎన్ రోడ్డు అత్యంత దారుణంగా వుంది. కొన్నిచోట్ల రహదారి మొత్తం భారీ గొయ్యి ఏర్పడి వర్షం కురిస్తే నీరు నిలిచి చెరువును తలపిస్తున్నది. బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట, వడ్డాది, లోపూడి, పొట్టిదొరపాలెం, బూదిరెడ్లపాలెం గ్రామాల పరిధిలో రహదారిపై భారీ గోతులు ఏర్పడి పూర్తిగా దెబ్బతిన్నది. బుధవారం కురిసిన కొద్దిపాటి వర్షానికే ఈ గోతుల్లో నీరు చేరి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బీఎన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను 2023 డిసెంబరునాటికి పూర్తి చేయిస్తామని ఉత్తరాంధ్ర వైసీపీ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సుమారు ఏడాది క్రితం చేసిన ప్రకటనను ఈ సందర్భంగా ప్రజలు గుర్తు చేస్తున్నారు.



వడ్డాది వద్ద రోడ్డుపై ఏర్పడిన గొయ్యిలో నిలిచి వర్షం నీరు



విజయరామరాజుపేట సమీపంలో చెరువును తలపిస్తున్న భారీ గొయ్యి

సీ-విజిల్ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల అధికారులు సీ-వీజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఎన్నికల నియమావళిని శతశాతం అమలు చేయాలన్నారు. అన్ని చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు పక్కాగా జరగాలన్నారు. డబ్బు, మద్యం, మాదకద్రవ్యాల రవాణాపై అధికారులు నిఘా పెట్టి ప్రజల నుంచి ఫిర్యాదులు రాకముందే గుర్తించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఆర్డీఓలు చిన్నికృష్ణ, జయరామ్, గ్రామ/ వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి మంజులవాణి, ఆడిట్ అధికారి గోవిందరాజులు, మాడుగుల, ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు జీవీ సత్యవాణి, మనోరమ, కె.గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

బ్రేకులు ఫెయిలై.. ధాన్యం వ్యాన్ బోల్తా

ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

- అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పరిధిలో ఘటన
- మృతుడు, క్షతగాత్రుల స్వస్థలం దేవరాపల్లి మండలం కాశీపురం



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం. మధ్యలో వున్న వ్యక్తి దాసరి రమణ. ఇతను దారిలోనే మృతిచెందాడు.



దాసరి లక్ష్మణ (ఫైల్ ఫొటో)

దేవరాపల్లి, మార్చి 22: మండలానికి సమీపంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పాతకుడియా సమీపంలో ధాన్యం లోడుతో వస్తున్న బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఇద్దరికి తీవ్ర గాయాలుగా మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి చెందిన గంగరాజు అనే వ్యక్తి ... మిగతా 8వ పేజీలో

యువకుడు అనుమానాస్పద మృతి

- హత్యగా ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు





మృతదేహం వద్ద క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్. (ఇన్‌సెట్‌లో) కర్రి కొండబాబు (ఫైల్ ఫొటో)

మాడుగుల రూరల్, మార్చి 22 : మండలంలోని ఎం.కృష్ణాపురం సమీపంలో ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే ఇది ముమ్మాటికీ హత్య అని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఆ కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ దామోదర నాయుడు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

మండలంలోని వమ్మలి గ్రామానికి చెందిన కర్రి కొండబాబు(25)కు భార్య నాగ సుశీల, ఇద్దరు పిల్లలు (కుమార్తెకు మూడేళ్లు, కుమారుడికి ఏడాది వయసు) వున్నారు. వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం కొండబాబు కూలీ పనులకు వెళ్లకుండా ఇదే గ్రామానికి చెందిన తన స్నేహితులు రాజు, భాస్కర్‌లతో కలిసి మద్యం సేవించి సాయంత్రం వరకు సరదాగా తిరిగారు. రాత్రి ఏడున్నర గంటలు దాటినా కొండబాబు ఇంటికి రాకపోవడంతో నాగసుశీల ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని అడిగింది. గాదిరాయిలో ఉన్నానని, కొద్దిసేపట్లో ఇంటికి వచ్చేస్తానని చెప్పాడు. కానీ ఎంతసేపటికీ కొండబాబు ఇంటికి రాలేదు. ఇదిలావుండగా గాదిరాయి గ్రామం నుంచి ఎం.కృష్ణాపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో వున్న చిట్టిగెడ్డ కాలువలో శుక్రవారం ఉదయం ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 22: జాతీయ రహదారిలోని నూకాంబిక ఆలయ ముఖ ద్వారానికి సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరావు తెలిపారు. మునగపాక మండలం తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన ముప్పిడి ఉమామహేశ్వరరావు (23) ఫొటోగ్రాఫర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈయన గురువారం సాయంత్రం అనకాపల్లి పట్టణానికి పని మీద ద్విచక్ర వాహనంపై వచ్చాడు. పని ముగించుకున్న తరువాత స్వగ్రామానికి వెళ్లే సమయంలో అర్ధరాత్రి కావడంతో అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు బాగోలేనందున జాతీయ రహదారి మీదుగా తోటాడకు చేరుకుని అక్కడి నుంచి స్వగ్రామానికి వెళదామని బయలుదేరాడన్నారు. అలా వెళ్తుండగా నూకాంబిక ఆలయ ముఖ ద్వారం సమీపంలో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పడంతో పడిపోయాడన్నారు. ఈ ఘటనలో తలకు, నోటికి, ముక్కుకి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. సంఘటన తెలుసుకున్న మృతుని అక్క ఎం.కళావతి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరావు తెలిపారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదని తెలిపారు.

ఏలేరు కాలువలో పడి మరో యువకుడు..

కశింకోట, మార్చి 22 : మండలంలోని బంగారయ్యపేట గ్రామ సమీపంలో ఉన్న ఏలేరు కాలువలో పడి యువకుడు మృతి చెందాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఏఎస్‌ఐ కే.ఎ.దొర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బుద్దన పవన్‌కుమార్(19) శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఏలేరు కాలువ గట్టుపై నుంచి తన స్నేహితుడితోపాటు, పెంపుడు కుక్కను తీసుకొని వెళుతుండగా ఒక్కసారిగా కుక్క ఉరకడంతో దీంతో పాటు పవన్‌కుమార్ కూడా కాలువలో పడిపోయాడన్నారు. పక్కనే ఉన్న స్నేహితుడు పెద్దగా కేకలు వేయడంతో గ్రామస్థులు వెలికి తీయగా అప్పటికే పవన్‌కుమార్ మృతి చెందాడని తెలిపారు. మృతుడు తల్లి బుద్దన వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అనుమానాస్పదంగా యువతి మృతి!


అపర్ణ ప్రణీత మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

నర్సీపట్నం, మార్చి 22: మునిసిపాలిటీలోని కొత్త వీధిలో ఓ యువతి అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతురాలి తండ్రి ముమ్మిన సుబ్బన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవీధికి చెందిన ముమ్మిన సుబ్బన్న, మహేశ్వరి దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె అపర్ణ ప్రణీత (20) ఇంటర్ వరకు చదువుకొని ఇక్కడున్న ఓ మెడికల్ షాపులో పనిచేస్తుంది. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇంటి బయట చిన్న పిల్లలతో ఆడుకుంటూ కొంత సమయం తర్వాత పడక గదిలోకి వెళ్లింది. తన పెద్ద కుమార్తె వెళ్లి చూసే సరికి అపర్ణ చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేళాడుతూ కనిపించిందని సుబ్బన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హుటాహుటిన ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ కాంతికుమార్, ఎస్‌ఐ సుధాకరరావు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు.

ప్రియుడే హంతకుడు

» వివాహిత మృతి కేసును ఛేదించిన పోలీసులు

మాడుగుల రూరల్, మార్చి 22 : మండలంలోని లోవ పొన్నవోలులో వివాహిత మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ దామోదరనాయుడు శుక్రవారం తెలిపిన వివరాలివి. లోవ పొన్నవోలు గ్రామానికి చెందిన రెడ్డి భవానీ (28)కి, ఇదే మండలం దిబ్బూరు గ్రామానికి చెందిన చామంతుల మధుతో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయం భవానీ భర్త ప్రకాశ్‌కు తెలియడంతో ఇంట్లో గొడవలు జరిగేవి. దీంతో తనను పెళ్లి చేసుకోవాలని భవానీ మధును పట్టుబట్టేదని ఎస్‌ఐ చెప్పారు. ఎలాగైనా ఈమెను వదిలించుకోవాలనే ఉద్దేశంతో మధు ఈ నెల 17వ తేదీ ఆదివారం మధ్యాహ్నం ఆమెను ఇంటి సమీపంలోని సరుగుడు తోటలోకి రమ్మని పిలిచి, అక్కడ హత్య చేసినట్టు ఎస్‌ఐ వివరించారు. డీఎస్పీ అప్పలరాజు, సీఐ స్వామినాయుడు లోతుగా విచారణ జరిపి, మధుయే హత్యచేసినట్టు నిర్ధారించారన్నారు. ఈ మేరకు నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్‌ఐ తెలిపారు.

కాగితలో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ విజయ్ కుమార్

నక్కపల్లి, మార్చి 22: మండలంలోని కాగిత గ్రామంలో ఒక ఇంటిలో చోరీ జరిగినట్టు సీఐ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ గ్రామానికి చెందిన పోతంశెట్టి గోవింద్ తమ బంధువుల ఇంటిలో జరిగే వివాహానికి కుటుంబంతో కలిసి గురువారం ఊరెళ్లినట్టు చెప్పారు. శుక్రవారం తిరిగొచ్చేసరికి ఇంటి తలుపులు తెరచివుండడంతో దొంగతనం జరిగినట్టు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు తలుపు తాళం తెరచి, ఇంట్లోకి వెళ్లి బీరువా పగులగొట్టి, రూ.20 వేలు నగదు పట్టుకుపోయినట్టు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్‌కుమార్, క్లూస్ టీం బృందం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

వైసీపీ జెండా తొలగిస్తుండగా కరెంట్ షాక్

» వీఆర్‌ఏ, పారిశుధ్య సిబ్బందికి స్వల్ప గాయాలు

ఎస్.రాయవరం, మార్చి 22: మండలంలోని వమ్మవరంలో విద్యుత్ స్తంభానికి ఉన్న వైసీపీ జెండాను తొలగిస్తుండగా వీఆర్‌ఏ గోరింట్ల వీరదాసు, పారిశుధ్య కార్మికుడు కుందూరు అప్పారావు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిద్దరిని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో అక్కడ చికిత్స అందజేసి, ఇంటికి పంపివేశారు. వైసీపీ జెండాను శుక్రవారం నాటి వరకు తొలగించకపోవడానికి గల కారణంపై గ్రామ కార్యదర్శిని ఉన్నతాధికారులు వివరణ కోరడంతో వీటిని తొలగిస్తుండగా ప్రమాదం జరిగింది.

ప్రశాంతంగా టెన్త్ గణితం పరీక్ష

అనకాపల్లి రూరల్, మార్చి 22: జిల్లాలోని పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం గణితం పరీక్షను నిర్వహించినట్టు డీఈవో వెంకటలక్ష్మి తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 21,258 మందికి గాను 21,142 మంది హాజరు కాగా.. 116 మంది గైర్హాజరు అయినట్టు చెప్పారు. అలాగే ఈ పరీక్షకు ప్రైవేటు విద్యార్థులు 1,312 మంది హాజరుకావాల్సి ఉండగా 942 మంది హాజరై.. 370 మంది గైర్హాజరు అయినట్టు ఆమె తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఆగని వైసీపీ నేతల గ్రావెల్ అక్రమాలు

రాత్రిపూట యథేచ్ఛగా తవ్వకాలు

- » మార్టురు ప్రైవేటు వెంచర్‌కు 200 లారీలు తరలింపు
- » పట్టించుకోని పోలీస్, రెవెన్యూ, మైన్స్ అధికారులు
- » అనుమతులున్నాయంటూ బుకాయింపు


తుమ్మపాల నుంచి మార్టూరు వెళ్లే జంక్షన్ వద్ద ఒక ప్రైవేటు లేఅవుట్ స్థలంలో గ్రావెల్ వేసిన చిత్రం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అడ్డగోలు గ్రావెల్ తవ్వకాలకు జిల్లాను అధికార పార్టీ నాయకులు వేదికగా మార్చుకున్నారు. జిల్లాల పునర్విభజన తరువాత ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో పాగావేసిన గ్రావెల్ మాఫియా అధికార పార్టీ నాయకుల దన్నుతో పదుల సంఖ్యలో అనధికార గ్రావెల్ క్వారీలు నడుపుతున్నా.. అడ్డుకొనే వారే కరువయ్యారు. అనకాపల్లి, అచ్యుతాపురం, రాంబిల్లి, కశింకోటతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు భూములతో ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ యధేచ్ఛగా గ్రావెల్ కొల్లగొట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. ఒకవైపు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు క్షణం తీరిక లేకుండా ఉండడంతో కొందరు ఇదే అదునుగా భావించి తమను అడిగేవారే లేరనే ధీమాతో యథేచ్ఛగా కొండలను పిండి చేసి జేబులు నింపుకుంటున్నారు. తాజాగా అనకాపల్లి మండలం మార్టూరులో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరిపి అమ్ముకుంటున్నారు. వాస్తవానికి మార్టురులో ఎవరికి గ్రావెల్ తవ్వకాలకు అనుమతి లేకపోయినా వైసీపీ నాయకులు మాత్రం తమకు అనుమతులు ఉన్నాయంటూ గ్రావెల్ దందాకు పాల్పడుతున్నారు. గడిచిన వారం రోజులుగా ప్రతిరోజు రాత్రిపూట మార్టూరులో గ్రావెల్ తవ్వకాలు జరిపి మార్టూరు కూడలిలో ఒక ప్రైవేటు వెంచర్‌కు లారీలు, టిప్పర్లలో గ్రావెల్ తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఇప్పటికే 200 లారీలకు పైగా గ్రావెల్‌ను తరలించి మూడు ఎకరాల స్థలాన్ని చదును చేశారు. వైసీపీ ప్రజాప్రతినిధి ఒకరు దగ్గరుండి మరీ ఈ వ్యవహారం నడుపుతున్నట్టు చెబుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోగా ప్రతిరోజు తరలిపోతున్న గ్రావెల్ వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. ఎవరైనా ప్రశ్నిస్తే, అనుమతులు ఉన్నాయి.. అధికారులకు మామూళ్లిచ్చాం.. మీకేంటి అనే ధోరణిలో జవాబిస్తున్నారు. సామాన్యులు గృహ అవసరాలకు ట్రాక్టర్లలో గ్రావెల్ తరలిస్తే అడ్డుకొనే పోలీసులు, గనులు, రెవెన్యూ శాఖాధికారులు ప్రశ్నించకుండా చూసీచూడనట్టు పోతుండడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు అక్రమ గ్రావెల తవ్వకాలు, రవాణాకు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

విశాఖను డ్రగ్స్ రాజధానిగా మార్చిన ఘనత వైసీపీదే

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, మార్చి 22: విశాఖను డ్రగ్స్ రాజధానిగా మార్చేసిన ఘనత వైసీపీదేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విశాఖ కేంద్రంగా గంజాయి రవాణా సాగుతుందని కేంద్ర నిఘా వర్గాలు గతంలోనే చెప్పాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జగన్ ముఠా పాపాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయన్నారు. విశాఖ తీరంలో బ్రెజిల్ నుంచి తరలిస్తున్న 25 వేల కిలోల డ్రగ్స్ పట్టుబడిందన్న వార్త ఉమ్మడి జిల్లాలను కలవరపరిచిందన్నారు. విశాఖలోని ఒక ప్రైవేటు కంపెనీ పేరుతో ఈ డ్రగ్స్‌ను దిగుమతి చేసుకునే విషయంలో జగన్‌రెడ్డి గ్యాంగ్ ఎంతగా బరితెగిస్తుందో అర్థమవుతుందన్నారు. ప్రశాంతంగా ఉండే విశాఖను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చేశారని ఆరోపించారు. గంజాయి, కొకైన్ ఇతర డ్రగ్స్‌కు నిలయంగా విశాఖ మారిందని, పెద్ద సంఖ్యలో యువత తప్పుడు మార్గంలో వెళ్లేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. తక్షణమే డ్రగ్స్ నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన వారిపై చర్యలకు ఉపక్రమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కేకేవీఏ నారాయణరావు, కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, మళ్ల గణేష్, గుడాల సత్యనారాయణ, బొడ్డేడ మురళీ పాల్గొన్నారు.

చెరకు కోతలో ఖర్చు తగ్గించేందుకు యాంత్రీకరణ అవసరం

» ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు


చెరకు కోత యంత్రాన్ని పరిశీలిస్తున్న రైతులు, శాస్త్రవేత్తలు

కొత్తూరు, మార్చి 22: రైతులకు ఖర్చు తగ్గించేందుకు చెరకు కోత యాంత్రీకరణ ఎంతో అవసరమని, వాటిని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పీవీకే.జగన్నాథరావు అన్నారు. శుక్రవారం ఆర్ఏఆర్ఎస్‌లో సోలాపూర్ సందర్శించిన రైతులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరకు కోతకు రైతుకు సాధారణంగా టన్నుకు వెయ్యి రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. హోల్కేన్ హార్వెస్టర్ యాంత్రీకరణను రైతులు సమిష్టితో గ్రూపుగా తీసుకున్నట్టయితే కేవలం టన్నుకి రూ.400లు ఖర్చు అవుతుందన్నారు. దీంతో 60శాతం పైబడి ఈ యంత్రం ద్వారా ఖర్చు ఆదా అవుతుందన్నారు. ఈ యంత్రం గంటకి 5 టన్నులు చొప్పున రోజుకి 50 టన్నులు చెరకు గెడ కోయడంతోపాటు గెడపై ఉన్న చెత్తను తొలగిస్తుందన్నారు. ఈ యంత్రం పనితనాన్ని వీక్షించేందుకు సోలాపూర్ వెళ్లి రావడం జరిగిందన్నారు. తమతోపాటు ఆరుగురు రైతులు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి తీసుకువెళ్లామన్నారు. ఈ యంత్రం కొనుగోలు చేసేందుకు రూ.35లక్షలు పైబడి ఖర్చు అవుతుందన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలు, ప్రభుత్వం చొరవ తీసుకొని ఈ యంత్రాన్ని కొనుగోలు చేసి రైతులకు ఖర్చు తగ్గించేందుకు కృషిచేయాలని రైతులు కోరారు. అనంతరం సోలాపూర్‌లో రైతులు సందర్శించిన చిత్రాలను హోల్కేన్ హార్వెస్టర్ చిత్రాలు, యంత్రం పనితనం వీడియోలు ప్రదర్శించారు. ఈ సమావేశంలో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.రాజేంద్రప్రసాద్, రైతులు బి. హరికృష్ణ, సన్యాసినాయుడు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత, రక్షణ అంశాలను మ్యానిఫెస్టోలో పెట్టాలి

» ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి


మ్యానిఫెస్టో ప్రదర్శిస్తున్న ప్రభావతి తదితరులు

నర్సీపట్నం, మార్చి 22: మహిళా సాధికారత, రక్షణ అంశాలను ప్రధాన రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో పెట్టాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడి బాలికల వసతి గృహంలో మ్యానిఫెస్టోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, హింసను అరికట్టడం, ఒంటరి మహిళలకు ప్రత్యేక గుర్తింపు, బాలల సంక్షేమం అంశాలను రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు ఎల్.గౌరీ, సూర్యప్రభ, ప్రసన్న, రాజేశ్వరి పాల్గొన్నారు.

అనితపై సోషల్ మీడియాలో వచ్చిన వార్త అవాస్తవం

» లక్కీ షాపింగ్ మాల్ ప్రతినిధి జి.రమేష్


మాట్లాడుతున్న లక్కీ షాపింగ్ మాల్ ప్రతినిధి జి.రమేష్

పాయకరావుపేట, మార్చి 22 : స్థానిక లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత యాజమాన్యాన్ని బెదిరించి రూ.50 లక్షల విలువైన చీరలు తీసుకెళ్లారని సోషల్ మీడియాలో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవమని షాపింగ్ మాల్ ప్రతినిధి జి.రమేష్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అందరు ఆహ్వానితులతోపాటు అనిత వచ్చి, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేసి వెళ్లారు తప్ప సోషల్ మీడియాలో పేర్కొన్నట్టుగా ఏమీ జరగలేదన్నారు. అదేవిధంగా అనితపై తాము పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు వార్తను ఎవరూ నమ్మవద్దని కోరారు. అనితపై తప్పుడు వార్తను సోషల్ మీడియాలో పెట్టినవారిపై చర్యలు తీసుకుంటామని లక్కీ షాపింగ్ మాల్ ప్రతినిధి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ కిరాతకం

» భార్యకు శిరోముండనం చేసిన కానిస్టేబుల్

» ఆపై హత్యాయత్నం... నిందితుడి అరెస్టు


కానిస్టేబుల్ భవానీ

విశాఖపట్నం, మార్చి 22: భార్య పట్ల అతి కిరాతకంగా ప్రవర్తించాడో కానిస్టేబుల్. శిరోముండనం చేయడంతో పాటు ఆమె కనుబొమ్మలనూ కత్తిరించాడు. ఈ దురాగతానికి పాల్పడిన అనకాపల్లి టౌన్ కానిస్టేబుల్‌ను నగరంలోని నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రైల్వే న్యూకాలనీ శివాలయంవీధికి చెందిన జి.జనయత్రిమహాలక్ష్మికి 2013లో తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన గూడుపు భవానీ శంకర్ (38)తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భవానీశంకర్ ప్రస్తుతం అనకాపల్లిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లైన నాలుగో నెల నుంచి భవానీశంకర్ కట్నం కోసం వేధింపులు ప్రారంభించాడు. దీంతో పాటు అనుమానంతో భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీన భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ నెల 18న మహాలక్ష్మిని ఆమె కన్నవారింటికి పంపించివేశాడు. మరుసటి రోజు అత్తారింటికి తిరిగి వెళ్లింది. అక్కడ అత్త, ఆడపడుచులు మందలించడంతో మహాలక్ష్మి పుట్టింటికి వచ్చేసింది. ఈ నెల 20వ తేదీన భవానీశంకర్ అత్తారింటికి వెళ్లి కేకలు వేస్తూ దాడికి దిగాడు. ఆమె తప్పించుకుని ఓ గదిలోకి వెళ్లి ఉండిపోయింది. దీంతో భవానీశంకర్ మహాలక్ష్మి సోదరుడి బిడ్డను (14 నెలలు) గట్టిగా పట్టుకుని గదిలో నుంచి రాకుంటే గొంతు నొక్కేస్తానని హెచ్చరించాడు. మహాలక్ష్మి బయటకు రాగా తనతో పాటు తీసుకువెళ్లిన ట్రిమ్మర్‌తో జుట్టును కత్తిరించి గుండు చేశాడు. ఆ తరువాత కనుబొమ్మలను తొలగించాడు. ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మహాలక్ష్మి తండ్రి, స్థానికులు నిలువరించడంతో పారిపోయాడు. ఈ అఘాయిత్యాలపై ఆమె ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎం.సూర్యారావు కేసు నమోదు చేశారు. వేధింపులు, ఇతర నేరాలకు పాల్పడినందుకు 409ఎ, 307, 506 సెక్షన్ల కింద కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

దువ్వాడ మీదుగా సంత్రాగచ్చి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, మార్చి 22: హోలీ పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా సంత్రాగచ్చి, సికింద్రాబాద్ మధ్య ఒక ట్రిప్పు ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 07645 నంబరు గల రైలు ఈనెల 23న రాత్రి 9.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 9.35 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 12.15 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరిగి 07646 నంబరు గల రైలు ఈనెల 25న ఉదయం 5.45 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి అదేరోజు రాత్రి 7.35 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 8.10 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

కిరండోల్ రైలు దంతెవాడ వరకే...

భద్రతా కారణాల దృష్ట్యా 18514 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలో 18513 నంబరు గల రైలు ఈనెల 23 నుంచి 31వ తేదీ వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడపనున్నట్టు సీనియర్ డీసీఎం తిపాఠి తెలిపారు. 08551 నంబరు గల రైలు ఈనెల 22 నుంచి 31వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరిగి 08552 నంబరు గల రైలు ఈ నెల 23 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తుందని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలు రద్దు చేశామన్నారు.


చంద్రబాబుతో గండి బాబ్జీ, అతని కుమారుడు వంశీ

సముచిత స్థానం కల్పిస్తాం

» గండి బాబ్జీకి చంద్రబాబునాయుడు, నారా లోకేష్ హామీ

» 'సౌత్' ఇన్‌చార్జిగా కొనసాగుతూ జనసేన అభ్యర్థి విజయానికి కృషి చేయాల్సిందిగా సూచన

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తగిన న్యాయం చేస్తామని విశాఖ దక్షిణ నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌చార్జి గండి బాబ్జీకి ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. బాబ్జీని, ఆయన కుమారుడిని విశాఖ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి ఎం.శ్రీభరత్ శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి తీసుకువెళ్లారు. లోకేశ్‌తో సమావేశం ఏర్పాటుచేశారు. గండి బాబ్జీకి సముచిత స్థానం కల్పించాలని శ్రీభరత్ కోరగా లోకేశ్ సానుకూలంగా స్పందిస్తూ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ప్రస్తుతానికి విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్ష పదవి చేపట్టాలని సూచించగా..అందుకు బాబ్జీ అంగీకరించారు. అదే సమయంలో విశాఖ దక్షిణ ఇన్‌చార్జిగా వ్యవహరించి వచ్చే ఎన్నికల్లో మిత్రపక్షమైన జనసేన అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలని లోకేశ్ సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు అధిష్ఠానం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సాయంత్రం గండి బాబ్జీ, ఆయన కుమారుడు వంశీ ఇద్దరూ పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిశారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని, రానున్న ఎన్నికల్లో మిత్రపక్షం అభ్యర్థి విజయానికి కృషిచేయాలని చంద్రబాబునాయుడు సూచించారు. అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని విధాలా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. గండి వంశీ భవిష్యత్తును యవనేత నారా లోకేశ్‌కు అప్పగిస్తానని అన్నారు.

పరీక్షా కేంద్రాల బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ


గాంధీనగరం పరీక్షా కేంద్రంలో పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 22: పట్టణంలోని పలు పది పరీక్షా కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ పర్యవేక్షించారు. పట్టణంలోని గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్, నరసింగరావుపేటలోని నారాయణ విద్యాసంస్థలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈయన వెంట పట్టణ సీఐ జి.శంకరరావు ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో


కేజీబీవీ బాలికలతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

నక్కపల్లి, మార్చి 22: నక్కపల్లి కేజీబీవీ పాఠశాలను శుక్రవారం మధ్యాహ్నం జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీ సమస్యలు, భోజనం, వసతి సదుపాయాల గురించి ఆరా తీశారు. టెన్త్ పరీక్షలు రాస్తున్న బాలికలతో ఆమె మాట్లాడారు. పరీక్షలు బాగా రాసి, మంచి ఫలితాలు సాధించాలని డీఈవో సూచించారు. ఆమె వెంట ఎంఈవో నరేశ్, కేజీబీవీ ఎస్‌వో సలీమ్, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి వున్నారు.

జాతీయ రగ్బీ జట్టుకి అచ్యుతాపురంలో కోచింగ్

» 25వ తేదీ నుంచి భువనేశ్వర్‌లో జాతీయ పోటీలు


రగ్బీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకునాయుడు

అచ్యుతాపురం, మార్చి 22: జాతీయ స్థాయికి ఎంపికైన రగ్బీ జట్టుకి అచ్యుతాపురంలో కోచింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జాతీయ స్థాయి రగ్బీ పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర జట్టుని ఈనెల 10న గుంటూరులో ఎంపిక చేశారు. జట్టులో 23 మంది క్రీడాకారులకు అచ్యుతాపురంలో మూడు రోజులపాటు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. దీనికి కావలసిన వసతిని స్థానిక సర్పంచ్ భర్త వెంకునాయుడు సమకూర్చారు. ఈ జట్టులో అచ్యుతాపురం పట్టణానికి చెందిన కూండ్రపు నాగ వెంకటరావు మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.

దుష్ప్రచారంపై ఎన్నికల సంఘానికి అనిత ఫిర్యాదు

నక్కపల్లి, మార్చి 22: పాయకరావుపేటలో ఒక షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి తాను వెళితే వైసీపీ సోషల్ మీడియా పేటీఎం బ్యాచ్, తునికి చెందిన ఒక వలంటీర్ దుష్ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టారని తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత తెలిపారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. శుక్రవారం ఆమె ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ.. ఆ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వైసీపీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీలకు చెందిన నాయకులు, ఇతర అతిథులు కూడా వచ్చారన్నారు. ఒక్క తనపై తప్పుడు పోస్టింగ్‌లు పెట్టడం వైసీపీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. సంబంధిత వలంటీర్‌తోపాటు, తనపై తప్పుడు పోస్టింగ్‌లు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్టు అనిత చెప్పారు. వలంటర్లు వైసీపీ మాయలో పడి ఇటువంటి చర్యలకు పాల్పడినా, ఓటర్లను ప్రలోభపెట్టినా కేసుల్లో ఇరుక్కోవల్సివస్తుందని ఆమె హెచ్చరించారు. ఆ తరువాత ఎటువంటి ఉద్యోగాలకు కూడా పనికిరారన్నారు.

గ్యారేజీలో కొత్త చెత్త వాహనాలు



గ్యారేజీకే పరిమితమైన కొత్తగా వచ్చిన చెత్త వాహనాలు

ఎలమంచిలి, మార్చి 22: మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తడి,పొడి చెత్త తరలించే కొత్త వాహనాలు గ్యారేజీకే పరిమితమయ్యాయి. మునిసిపాలిటీలోని 25 వార్డుల్లో తడి, పొడి చెత్తలను సేకరించేందుకు ఇటీవల నూతనంగా వాహనాలు మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నాయి. కొన్ని రోజులుపాటు మునిసిపల్ కార్యాలయంలో ఉంచిన అధికారులు ఇటీవల ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవం రోజున మంత్రి ప్రారంభించారు. అయితే ఆ వాహనాలను వినియోగంలోకి తీసుకురాకుండా మునిసిపల్ ప్రజారోగ్య గ్యారేజీలో ఉంచడం విశేషం. ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు చెత్త సేకరణకు వచ్చిన వాహనాలను గ్యారేజీకి పరిమితం చేయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు కొత్తగా వచ్చిన ఈ వాహనాలతోపాటు మునిసిపాలిటీలో చెత్త తరలించే వాహనాల రంగు మార్చకపోవడం విశేషం.

గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర బలగాల కవాతు



జంపపాలెంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఎలమంచిలి, మార్చి 22 : రానున్న సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిపించేందుకు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ట్రైనీ డీఎస్పీ జి భవ్య, సీఐ ఎస్కే గఫూర్‌ల పర్యవేక్షణలో ఎస్ఐ సింహాచలం, సిబ్బంది కవాతు నిర్వహించారు. మండలంలోని జంపపాలెం, ఏటికొప్పాక తదితర పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి.

దివ్యాంగ విద్యార్థుల ఉపకరణాలకు వైద్యశిబిరం



దివ్యాంగ విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యుడు

అనకాపల్లి టౌన్, మార్చి 22 : స్థానిక జీవీఎంసీ ఉడ్‌పేట ప్రైమరీ పాఠశాల ఆవరణలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు అల్మికో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు ఇచ్చేందుకు గుర్తింపు నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 18 ఏళ్లలోపు వయసు గల దివ్యాంగ విద్యార్థులకు వీల్‌ఛైర్లు, ట్రైసైకిళ్లు, క్లచెస్, వాకర్స్, రోలేటర్స్, బ్రెయిలీ కిట్స్, వినికిడి యంత్రాలు ఇవ్వడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.శకుంతల, ఎంఈవో కోటేశ్వరరావులు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి 107 మంది దివ్యాంగ విద్యార్థులు హాజరయ్యారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో కంటి, చెవి, ముక్కు, గొంతు, ఎముకల వైద్యులు వై.గంగాధర్, ఫరుద్దీన్, దివ్య ప్రియలు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉపకరణాలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు నడుం బిగించాలి

తుమ్మపాల, మార్చి 22 : క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి నజరత్ షమీమ్ పేర్కొన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి క్షయ వ్యాధి నివారణపై తుమ్మపాలలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి మైకో బాక్టీరియా అనే క్రిమి ద్వారా వ్యాపిస్తుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది యల్లాజీ, పెంటయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమం వెబ్ పోర్టల్ ఆవిష్కరణ

- జిల్లా సైనిక సంక్షేమ అధికారి సత్యానందం

అనకాపల్లి రూరల్, మార్చి 22 : సైనిక సంక్షేమ శాఖ మాజీ సైనికుల కోసం వెబ్ పోర్టల్‌ను విడుదల చేసిందని జిల్లా సైనిక సంక్షేమ అధికారి సత్యానందం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువులు గుర్తింపు కార్డు కోసం డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యుఏపీ సైనిక్.సీఓఎం/ఏయూటీహెచ్/ఎల్ఓజీఐఎన్ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నింపి సంబంధిత ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసిన అనంతరం ప్రింట్ తీసి సైనిక సంక్షేమ శాఖ కార్యాలయానికి అందించాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

ఇళ్ల ముందే ర్యాంప్‌లు..

- డ్రైనేజీలోకి వెళ్లేందుకు అవకాశం లేక రోడ్లపై నిలిచిపోతున్న వర్షం నీరు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- పట్టణవాసులకు తప్పని ఇబ్బందులు



ర్యాంపులు ఏర్పాటు కారణంగా రోడ్డుపైనే నిలిచిపోయిన వర్షం నీరు

ఎలమంచిలి, మార్చి 22: టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం.. కొందరు ఇళ్ల యజమానులు రోడ్డుకు ఎత్తుగా ర్యాంపులు నిర్మించడంతో వర్షం నీరు రహదార్లపైనే నిలిచిపోతున్నది. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు డ్రైనేజీలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో రోడ్ల మీదనే నీరు నిలిచిపోతుండడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వార్డుల్లో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఇళ్ల యజమానులు కనీసం నిబంధనలను పాటించడం లేదు. ఇళ్ల యజమానుల తీరుపై మునిసిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలను పట్టణవాసులు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పట్టణంలో కొత్తపేట కాలనీ, గాంధీనగర్, మిలట్రీ కాలనీ తదితర పలు వార్డుల్లో రోడ్ల కంటే ఎత్తు ప్రదేశంలో ఇళ్ల ముందు ర్యాంపులు నిర్మించడంతో సమస్య తలెత్తుతున్నది. రెండు రోజులు క్రితం కురిసిన వర్షానికి పరమేశ్వరి థియేటర్ రోడ్డుపై వర్షం నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో వారు అధికారులు, ఇళ్ల యజమానుల తీరుపై మండిపడ్డారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాక్షస పాలనను అంతమొందిద్దాం

- పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగపూడి అనిత



అన్నవరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వంగలపూడి అనిత

కోటవురట్ల, మార్చి 22: రాష్ట్రంలో రాక్షపాలనను అంతమొందించేందుకు అన్నివర్గాల వారు కలిసి రావాలని పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అన్నవరంలో ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలను అణగదొక్కిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా తన గెలుపే లక్ష్యంగా ప్రజలు ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పెట్ల లింగంనాయుడు, నర్సీపట్నం జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

- జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్



విలేకర్లతో మాట్లాడుతున్న సుందరపు విజయ్‌కుమార్

మునగపాక (తుమ్మపాల), మార్చి 22 : రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మునగపాక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి అధికార పార్టీని గద్దె దించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు ఐదేళ్లలో వేయలేకపోగా ఏ ముఖం పెట్టుకుని వైసీపీ నాయకులు ఓట్లు దండుకోవడానికి వస్తారని విమర్శించారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కడం తప్ప లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ కావడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఉమ్మడి కార్యకర్తలంతా నడుం బిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరుశురాం, ఏవీ సత్యనారాయణ, కాళ్ల చంద్రమోహన్, కోరుకొండ ప్రసాద్, పి. సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలి : ప్రగడ



మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాత్రి నునపర్తిలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. జగనన్న రాక్షస పాలనకు స్వస్తి పలకాలంటే టీడీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నీరుకొండ నరసింగరావు, రెడ్డి శ్రీను, రెడ్డి అప్పారావు, కన్నూరి లక్ష్మణరావు, కూండ్రపు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నీటి కొరతను అధిగమించేందుకు కృషి చేయాలి : ఏడీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ జగన్నాథరావు

కొత్తూరు, మార్చి 22 : దేశంలో నీటి కొరతను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఆర్ఏఆర్ఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో నీటి కొరతను అధిగమించడానికి ప్రభుత్వంతోపాటు ఎన్‌జీవోలు, ప్రజలు సమిష్టిగా కృషిచేయాలన్నారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ దేశంలో నీటి కొరత విస్తరిస్తుందని అనడానికి ప్రస్తుత బెంగళూరులో పరిస్థితులను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు టి.శ్రీలత, ఎం.విశాలాక్షి, డి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేకాధికారిణి జి.ప్రమీల మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా నీటివనరులను కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థినులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో.. అనకాపల్లి మండలంలోని బవులవాడ, ఊడేరు తదితర గ్రామాల్లో శుక్రవారం ఎస్‌వీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఆర్‌పీ విల్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మానవ మనుగడకు జీవనాధారమైన నీటిని భద్రపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించే మార్గాలను రైతులు ఎంచుకోవాలన్నారు. అనంతరం నీటి పొదుపుపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మర్చంట్స్ అసోసియేషన్ లింగమూర్తి, కళాశాల అగ్రికల్చరల్ విద్యార్థులు, ఎస్‌వీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బండారుకు టికెట్ కేటాయించాలని పూజలు



నూకాంబిక ఆలయంలో పూజలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

పరవాడ, మార్చి 22 : పెందుర్తి టికెట్ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి కేటాయించాలని కోరుతూ శుక్రవారం రాత్రి వెన్నెలపాలెంలో ఆ పార్టీ శ్రేణులు నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెందుర్తి టికెట్ విషయంలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అట్టా సన్యాసిఅప్పారావు, పైలా రథాల సన్యాసిరావు, మేడిశెట్టి బాలాజీనాయుడు, పైలా వరలక్ష్మి, గొంప మారునాయుడు, బండారు సతీష్, ఇందల కొండలరావు, జనపాల రాము తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక

ఎలమంచిలి, మార్చి 22 : స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఐఫోన్ల తయారీ సంస్థ జీకే హ్యూమన్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలలో 15 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు.ఎంపికైన విద్యార్థులకు కాంచీపురంలో ఉచిత భోజన వసతితోపాటు నెలకు రూ.16వేలు స్టైఫండ్‌గా అందిస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజు, సుధాకర్ జేకేసీ కో-ఆర్డినేటర్ కె.వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

అనకాపల్లి రూరల్, మార్చి 22 : మండలంలోని సిరసపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చింతామణి దత్తత క్షేత్రం ట్రస్టీల ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు ఈ శిబిరాన్ని నిర్వహించి, 160 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. దృష్టి లోపం ఉన్న వారికి కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో క్షేత్ర ట్రస్టీ రాజు, శంకర్ ఫౌండేషన్ వైద్యులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో సప్తప్రాకార సేవ



సేవ నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, మార్చి 22 : స్థానిక దేమునిగుమ్మం వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణంలో భాగంగా శుక్రవారం ఆలయ బేడా మండపంలో సప్త ప్రాకార సేవని అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజసులోచన, ఆలయ అర్చకులు పులకండం విజయబాబు, పులకండం గిరిబాబు, ప్రసాద్‌బాబు, రాజేష్ పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యతపై ర్యాలీ



ర్యాలీ ప్రారంభించిన డీఎంహెచ్‌వో హేమంత్

అనకాపల్లి టౌన్, మార్చి 22 : ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ పట్టణంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ జరిగింది. జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 18 ఏళ్లు దాటిన వారందరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పురవీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి

అనకాపల్లి టౌన్, మార్చి 22 : టీబీ నివారణకు అంతా కలిసి కృషి చేస్తామని అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. టీబీ వారోత్సవాల్లో భాగంగా డీఎల్‌ఏటీవో డాక్టర్ ఎంఎస్‌వీ బాలాజీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఔను.. టీబీని అంతం చేయగలం.. అంటూ వక్తలు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. క్షయవ్యాధితో బాధపడుతున్న వారికి చికిత్సకు సరైన మార్గం చూపిస్తామని, క్షయవ్యాధి లక్షణాలు గురించి, నివారణ గురించి అందరికీ అవగాహన కల్పిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అయ్యప్పరెడ్డి, ఎం.పెంటయ్య, వెంకటలక్ష్మి, స్వప్న, జ్యోతి పాల్గొన్నారు.

వైసీపీ విజయానికి కృషి చేయాలి : మలసాల



అనకాపల్లి టౌన్, మార్చి 22 : రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయానికి అందరూ కృషి చేయాలని ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కోరారు. శుక్రవారం రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో కశింకోట మండలానికి చెందిన చెరకాం, సుందరయ్యపేట యువకులు పార్టీలోకి చేరడంతో వారికి కండువాలు వేసి స్వాగతించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి, పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. రానున్న 50 రోజులు పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అనకాపల్లి టౌన్, మార్చి 22 : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 93వ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాసరచన, ఉపన్యాస పోటీలు జరిగాయి. సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి ఎస్.నాగరమణ మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ స్వాతంత్ర్య ఉద్యమంలో యువతను భాగస్వామ్యం చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. శనివారం దొడ్డి రామునాయుడు భవనంలో జరిగే వర్ధంతి సభలో విజేతలకు బహుమతులు అందిస్తామని వారు తెలిపారు.

28న మరిడిమాంబ ఆలయ ప్రారంభం

పరవాడ, మార్చి 22 : మండలంలోని రావాడ శివారు జల్లెలపాలెంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయం ప్రారంభోత్సవ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈనెల 28న ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఆలయ కమిటీ ఛైర్మన్ మేడిశెట్టి మాణిక్యం, మేడిశెట్టి అప్పలనాయుడు, మేడిశెట్టి సోమునాయుడు, పితాని అప్పారావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక



అనిత సమక్షంలో టీడీపీలో చేరిన బంగారమ్మపేట యువకులు

నక్కపల్లి, మార్చి 22: మండలంలోని బంగారమ్మపేటకు చెందిన పలువురు మత్స్యకార యువకులు శుక్రవారం పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొవిరి గంగాధర్, గోసల శ్రీకాంత్, కొవిరి వెంకటేశ్ నేతృత్వంలో కొవిరి అప్పలరాజు, విజయ్, గణేశ్, మన్నియ్య, కొవిరి గోపి, కారే రాజు, కొవిరి జగదీశ్, మల్లేశ్వరి, చేపల ఆశీర్వాదం, రాకాతి శ్రీను తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, వైబోయిన రమణ, గింజాల వెంకటరమణ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన డీఈఓ

పాయకరావుపేట, మార్చి 22 : మండలంలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. పట్టణంలోని శ్రీచైతన్య, కనోసా స్కూల్, పాల్తేరు, ఎస్.నర్సాపురం పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ, పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఆమె వెంట మండల విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

రాంబిల్లి, మార్చి 22 : స్థానిక కస్తూర్బా విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి 6, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కేజీబీవీ ప్రత్యేకాధికారిణి జి.ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు 60 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు. ఆ విద్యార్థులు ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.2లక్షలు,పట్టణ ప్రాంతాల్లో రూ.1.4లక్షలలోపు ఉండాలన్నారు.

ఏఐటీయూసీ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ఎలమంచిలి, మార్చి 22 : అనకాపల్లిలో ఈనెల 23వ తేదీన జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి ఏసుదాసు శుక్రవారం తెలిపారు.ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, రాష్ట్ర, జిల్లా కార్మిక నాయకులు పాల్గొంటున్నారన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడితే కేసులు

న్యాయంపూడి గ్రామస్థులకు సీఐ విజయ్ కుమార్ హెచ్చరిక

నక్కపల్లి, మార్చి 22: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రతీ ఒక్కరూ ఎన్నికల కోడ్ పాటించాలని, శాంతి భద్రతలకు భంగం కలగకూడదని సీఐ విజయ్‌కుమార్ అన్నారు. ఎన్నికలు సందర్భంగా కక్షసాధింపు చర్యలు, కవ్వింపులకు ఎవరైనా పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం రాత్రి మండలంలోని న్యాయంపూడిలో ఆయన అవగాహనా సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు కొంతమంది నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని, యువకులు బైక్‌లు నడిపేటప్పుడు వేగంగా నడపకూడదని, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. సైబర్ నేరాలకు గురికాకుండా ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని, మొబైల్ ఫోన్లకు గుర్తు తెలియని నంబర్ల నుంచి అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లను ఓపెన్ చేస్తే, బ్యాంకు ఖాతాల్లో వున్న డబ్బులు మాయమవుతాయని సీఐ విజయ్ కుమార్ చెప్పారు.

బ్రేకులు ఫెయిలై..

... 5వ పేజీ తరువాయి

అనంతగిరి మండలంలోని సరసపాడు, చుట్టుపక్కల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేశారు. తీసుకురావడానికి అదే గ్రామానికి చెందిన దాసరి లక్ష్మణ(55), కొటాన సూర్యనారాయణ, గొంప మంగునాయుడుతోపాటు మొత్తం నలుగురు కూలీలను పురమాయించారు. వీరు శుక్రవారం తెల్లవారుజామున బొలేరో వాహనంలో సరసపాడు వెళ్లారు. ధాన్యాన్ని కాటా వేసి బస్తాల్లో నింపి, వ్యాన్‌లో లోడింగ్ చేసుకుని సాయంత్రం మూడు గంటల సమయంలో కాశీపురం బయలుదేరారు. పెదకోట పంచాయతీ పాత కుడియా సమీపంలోకి వచ్చేసరికి బ్రేకులు పనిచేయక వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో దాసరి లక్ష్మణ, కొటాన సూర్యనారాయణ, గొంప మంగునాయుడుకు తీవ్రగాయాలయ్యాయి. వ్యాన్ డ్రైవర్ రవితోపాటు మరో కూలీకి స్వల్పగాయాలయ్యాయి. వీరిని ప్రైవేటు వాహనంలో పినకోట పీహెచ్‌సీకి తీసుకువస్తుండగా దారిలోనే లక్ష్మణ మృతిచెందాడు. క్షతగాత్రులకు పినకోట వైద్యాధికారి డి.రూప్‌చంద్, సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు పంపారు. ఈ ప్రమాదంపై దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర అనంతగిరి పోలీసులకు సమాచారం అందించారు.

యువకుడు అనుమానాస్పద మృతి

... 5వ పేజీ తరువాయి

కొండబాబు శవమై కనిపించాడు. ఉదయం అటుగా వెళుతున్న వారు గుర్తించి ఈ విషయాన్ని వమ్మలి గ్రామస్థులకు, పోలీసులకు తెలియపరిచారు. ఎస్ఐ దామోదరనాయుడు సిబ్బందితో చేరుకుని పరిశీలించారు. తర్వాత అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు, కె.కోటపాడు సీఐ స్వామినాయుడు చేరుకుని మృతదేహాన్ని, పరిసరాలను పరిశీలించారు. ఇక్కడి కల్వర్టుపై కొండబాబు బైక్ సైడ్‌స్టాండ్ వేసి, కొత్త స్టీల్ క్యారేజీ తగిలించి ఉంది. బైక్ తాళం అక్కడ పడి ఉంది. కొండబాబు తల ఎడమవైపు రక్తస్రావమైంది. కుడి మోచేతి కింద రక్కేసినట్టు ఉంది. సెల్‌ఫోన్ కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వస్తున్నది. పోలీసులు క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌ని రప్పించి ఆధారాలు సేకరించారు. పోలీస్‌డాగ్ పంట కాలువ గట్టుపై ముందు వెళ్లి తిరిగి అక్కడ నుంచి రోడ్డు ఎక్కి ఎం.కృష్ణాపురం వెళ్లే మార్గంలో సుమారు 150 మీటర్ల దూరంలో ఉన్న పంట కల్లం వద్దకు వెళ్లి అక్కడ నుంచి తిరిగి మృతదేహం వద్దకు వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. కొండబాబు స్నేహితులు రాజు, భాస్కర్‌లను రప్పించి విచారిస్తున్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటవురట్ల, మార్చి 22: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనపు 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల కారణంగా శనివారం సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ ఎగిక్యూటివ్ ఇంజనీర్ విడివి రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 24వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు యండపల్లి, టీకేపల్లి, తంగేడు, రాజుపేట, రామన్నపాలెం, రామచంద్రపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

మద్యం బాటిళ్లు తీసుకువెళుతున్న ఇద్దరిపై కేసు

అనకాపల్లి టౌన్, మార్చి 22: అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోట్ల మద్యం బాటిళ్లు తీసుకువెళ్తున్న ఇద్దరిపై శుక్రవారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. నూకాంబిక ఆలయ ప్రాంతానికి చెందిన డి.చిన్నారావు కొత్తూరు పంచాయతీ ఆర్టీసీ కాలనీ వద్ద 12 క్వార్టర్ బాటిళ్ల మద్యంతో పట్టుకున్నట్టు చెప్పారు. అలాగే బవులవాడకు చెందిన ఎస్. జగ్గారావు విజయరామరాజుపేట వద్ద 12 క్వార్టర్ మద్యం బాటిళ్లతో దొరికాడన్నారు. ఇద్దరి దగ్గర నుంచి మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రామకృష్ణ తెలిపారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 22: మండలంలోని తానాం గ్రామానికి చెందిన పైలా అప్పారావు శుక్రవారం రాత్రి స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 15 మద్యం క్వార్టర్ బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా సీఐ బాలసూర్యారావు మార్గమధ్యలో అడ్డుకుని తనిఖీ చేశారు. అతని వద్ద గల బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

మంత్రిపాలెంలో ఏడు మద్యం సీసాలు..

మండలంలోని మంత్రిపాలెం గ్రామానికి చెందిన బలిరెడ్డి రమణ లంకెలపాలెంలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఏడు క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి శుక్రవారం రాత్రి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

▸ గొలుగొండ మండల సమావేశంలో సభ్యులు విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి



నీటి సమస్య వివరిస్తున్న గొలుగొండ సర్పంచ్

గొలుగొండ, మార్చి 22 : వేసవి ఆరంభమవుతున్న దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలు ఏమిటో వివరించాలని పలువురు సభ్యులు కోరారు. శుక్రవారం ఇక్కడ గొలుగొండ మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. మండలంలో తాగునీటి సమస్యపై అధికారులు దృష్టిపెట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. తొలుత వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ మాట్లాడుతూ ఏఎల్‌పురం, చోద్యం గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మరికొంతమంది గ్రామాల్లో తీగునీటి సమస్యను వివరించారు. గొలుగొండ సర్పంచ్ కసిపల్లి చినప్పారావు మాట్లాడుతూ మండల కేంద్రం గొలుగొండలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే, కాలనీల్లో తాగునీటికి పలువురు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఎంపీడీవో రత్నకుమారి స్పందిస్తూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు నిషేధం అన్నారు. ఇప్పటికే గ్రామాలకు గతంలో మంజూరైన అభివృద్ధి పనులు మాత్రమే కొనసాగించాలన్నారు. నూతన పనులు ప్రారంభిస్తే కోడ్ ఉల్లంఘన కింద వస్తుందన్నారు. ఈ విషయంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి, మండల స్థాయి అధికారులు, వ్యవసాయ సలహా మండలి మండల ఛైర్మన్ కొల్లు సత్యనారాయణలతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో పలువురు చేరిక

గొలుగొండ, మార్చి 22 : మండలంలోని గుండుపాలలో ఎన్నికల శంఖారావం సభను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ పాలన తీరును ఎండగట్టారు. తొలుత వైసీపీ నుంచి భారీగా చేరికలు జరిగాయి. వారందరికీ విజయ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, నాయకుల కొల్లి రాంబాబు, కె.రవివర్మ, చినబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టిపెట్టాలి'



మ్యాప్ ద్వారా పంటలను వివరిస్తున్న దృశ్యం

చీడికాడ, మార్చి 22 : వరి, చెరకు పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా మొగ్గుచూపాలని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నైరా కళాశాల విద్యార్థులు రైతులు రైతు లకు సూచించారు. రైతులకు ఏఏ వనరులు అందుబాటులో ఉన్నాయో శిరిజాం గ్రామంలో రైతులకు శుక్రవారం మ్యాప్ ద్వారా వివరించారు. ప్రతి ఏడాది పంటలు వేసేముందు పక్కా ప్రణాళికతో పాటు పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటలు తదితరాలపై చర్చించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ కొన్నెంపూడి విస్తరణాధికారి డాక్టర్‌ఎన్.కిశోర్, టీడీపీ నాయకులు కన్నూరు శ్రీరామ్మూర్తిలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

... 5వ పేజీ తరువాయి

కొండబాబు శవమై కనిపించాడు. ఉదయం ఆటుగా వెళుతున్న వారు గుర్తించి ఈ విషయాన్ని వమ్మలి గ్రామస్థులకు, పోలీసులకు తెలియపరిచారు. ఎస్ఐ దామోదరనాయుడు సిబ్బందితో చేరుకుని పరిశీలించారు. తర్వాత అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు, కె.కోట పాడు సీఐ స్వామినాయుడు చేరుకుని మృతదేహాన్ని, పరిసరాలను పరిశీలించారు. ఇక్కడి కల్వర్టుపై కొండబాబు బైక్ సైడ్‌స్టాండ్ వేసి, కొత్త స్టీల్ క్యారేజీ తగిలించి ఉంది. బైక్ తాళం అక్కడ పడి ఉంది. కొండబాబు తల ఎడమవైపు రక్తస్రావమైంది. కుడి మోచేతి కింద రక్కేసినట్టు ఉంది. సెల్‌ఫోన్ కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వస్తున్నది. పోలీసులు క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌ని రప్పించి ఆధారాలు సేకరించారు. పోలీస్‌డాగ్ పంట కాలువ గట్టుపై ముందు వెళ్లి తిరిగి అక్కడ నుంచి రోడ్డు ఎక్కి ఎం.కృష్ణాపురం వెళ్లే మార్గంలో సుమారు 150 మీటర్ల దూరంలో ఉన్న పంట కల్లం వద్దకు వెళ్లి అక్కడ నుంచి తిరిగి మృతదేహం వద్దకు వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. కొండబాబు స్నేహితులు రాజు, భాస్కర్‌లను రప్పించి విచారిస్తున్నారు.

ధాన్యం వ్యాన్ బోల్తా



ఘటనా స్థలంలో క్షతగాత్రులు, చెల్లాచెదురుగా ఉన్న ధాన్యం బస్తాలు

... 5వ పేజీ తరువాయి

అనంతగిరి మండలంలోని సరసపాడు, చుట్టుపక్కల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేశారు. తీసుకురావడానికి అదే గ్రామానికి చెందిన దాసరి లక్ష్మణ(55), కొటాన సూర్యనారాయణ, గొంప మంగునాయుడుతోపాటు మొత్తం నలుగురు కూలీలను పురమాయించారు. వీరు శుక్రవారం తెల్లవారుజామున బొలేరో వాహనంలో సరసపాడు వెళ్లారు. ధాన్యాన్ని కాటా వేసి బస్తాల్లో నింపి, వ్యాన్‌లో లోడింగ్ చేసుకుని సాయంత్రం మూడు గంటల సమయంలో కాశీపురం బయలుదేరారు. పెదకోట పంచాయతీ పాత కుడియా సమీపంలోకి వచ్చేసరికి బ్రేకులు పనిచేయక వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో దాసరి లక్ష్మణ, కొటాన సూర్యనారాయణ, గొంప మంగునాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. వ్యాన్ డ్రైవర్ రవితోపాటు మరో కూలీకి స్వల్పగాయాలయ్యాయి. వీరిని ప్రైవేటు వాహనంలో పినకోట పీహెచ్‌సీకి తీసుకువస్తుండగా దారిలోనే లక్ష్మణ మృతిచెందాడు. క్షతగాత్రులకు పినకోట వైద్యాధికారి డి.రూప్‌చంద్, సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు పంపారు. ఈ ప్రమాదంపై దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర అనంతగిరి పోలీసులకు సమాచారం అందించారు.

కాలం ఏదైనా.. సమస్య కామన్..!

▸ ఎండ కాస్తే దుమ్ము రేగుతుంది.. వాన కురిస్తే గుంతల్లో నీరు నిలుస్తుంది ▸ ప్రయాణాలకు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్న వాహనచోదకులు

▸ ఇన్నాళ్లూ ప్రజల మొర పట్టించుకోని ప్రజాప్రతినిధులు ▸ ఉన్నతాధికారులైనా దృష్టి సారించాలని అంతా వేడుకోలు



ఎంకే వల్లాపురం వద్ద ఎండ సమయంలో గాలిలో తేలుతున్న దుమ్ము, ధూళి

మాడుగుల రూరల్, మార్చి 22 : ఎండ కాస్తే.. దుమ్ము రేగుతుంది. వాన కురిస్తే.. గుంతల్లో నీరు నిలుస్తుంది. వెరసి కాలం ఏదైనా ప్రజలకు సమస్య కామన్ అన్నట్టుగా తయారైంది మండలంలోని పలు రహదారుల దుస్థితి. ఎంకే వల్లాపురం, కేజేపురం జంక్షన్, ఎం.కోటపాడు, ముకుందపురం, డి.సురవరం, సాగరం, ఎం.కోడూరు, కాశీపురం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ రూటు వడ్డాది- పాడేరు పరిధిలో ఉంది. ఆయా గ్రామాల మధ్య రోడ్డుపై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. కొత్తగా రోడ్డు వేయలేక కంకర రాళ్లు, క్రషర్‌బుగ్గి వేసి గుంతలు పూడ్చి చేతులు దులుపేసుకుంటున్నారు. దీంతో ఎండకాస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నారు. క్రషర్‌బుగ్గితో పాటు దుమ్ము, ధూళి గాల్లోకి ఎగిరి రోడ్డంతా కమ్మేస్తోంది. అంతేకాక అటుగా రాకపోకలు సాగించే వారికి కళ్లలో పడుతోంది. ఫలితంగా అవస్థలు పడుతున్నారు. ఇది లావుంటే, చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై పడిన గుంతల్లో నీరు చేరుతోంది. దీంతో రోడ్డు ఎక్కడో, గుంత ఎక్కడో గుర్తించలేని వాహనచోదకులు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. చాలా రోజుల నుంచి ఈ సమస్య ఉన్నా కన్నెత్తి చూసే వారు లేకపోవడంతో ఇటుగా ప్రయాణించేవారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి రహదారులకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా వారంతా కోరుతున్నారు.



కేజేపురం జంక్షన్ సమీపంలో గోతుల్లో చేరిన వర్షపు నీరు (ఫైల్)

కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రానికి మంచి రోజులు

▸ చోడవరం, మాడుగుల అసెంబ్లీల అభ్యర్థులు రాజు, ప్రసాదరావు



కేఎస్ఎన్ఎస్ రాజు, తాతయ్యబాబు తదితరుల అభివాదం

చోడవరం, మార్చి 22 : రాష్ట్రంలో జగన్, చోడవరంలో ధర్మశ్రీ పాలన నుంచి విముక్తి కల్పించేందుకు నియోజకవర్గంలోని ఓటర్లంతా సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, చోడవరం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు పిలుపునిచ్చారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ దుర్మార్గ పాలన సాగిస్తుందని విమర్శించారు. ఒక్క ఛాన్స్ అని జగన్, ధర్మశ్రీ చెప్పిన మాటలు నమ్మిన ఓటర్లు వారికి పట్టం కడితే, ఈ ఐదేళ్లలో అటు రాష్ట్రాన్ని, ఇటు నియోజకవర్గాన్ని సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. సుజల స్రవంతి ప్రాజెక్టును తీసుకుని వస్తే రైతులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, గోకివాడ కోటేశ్వరరావు బొడ్డేడ నాగగంగాధర్, నాలుగు మండలాల పార్టీనాయకులు పాల్గొన్నారు.



కె.కోటపాడులో మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు

కె.కోటపాడు, మార్చి 22 : టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థుల విజయానికి అంతా కృషి చేయాలని మాడుగుల నియోజకవర్గ అసెంబ్లీ టీడీపీ, జనసేన, బీజేపీల అభ్యర్థి పైలా ప్రసాదరావు కోరారు. కె.కోటపాడులో శుక్రవారం నిర్వహించిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు సమీపించినందున మూడు పార్టీల శ్రేణులు గ్రామ గ్రామాన పర్యటించి వైసీపీ ఐదేళ్ల పాలనలో అరాచకాలను వివరించడంతో పాటు ఉమ్మడి పార్టీల లక్ష్యాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, మాజీ ఎంపీపీ సబ్బవరపు రామానాయుడు, నాయకులు పూడి నారాయణమూర్తి, లెక్కల అవతారం, లెక్కల మల్లేశ్వరరావు, కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.

చీడికాడ : ఖండివరంలో టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ప్రజలంతా ఉమ్మడి అభ్యర్థులకు పట్టకట్టి తద్వారా రాష్ట్రాభివృద్ధికి దోహదపడాల్సిందిగా కోరారు. మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, వార్డు సభ్యులు జూరెడ్డి అప్పారావు, గుల్లిపల్లి వరహామూర్తి, ఎస్‌వీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం చారిత్రక అవసరం

▸ మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ

బుచ్చెయ్యపేట, మార్చి 22 : టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు చారిత్రక అవసరమని మాజీ మంత్రి, కూటమి అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని వడ్డాది వెంకన్న వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కొండదిగువన విలేకరులతో మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం ఛిన్నాభిన్నమైందని మండిపడ్డారు. యువత, రైతులు, మహిళలు ఏకమై ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కొణతాల పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచడం చారిత్రక అవసరమని పేర్కొన్నారు. కూటమి విజయంతోనే పోలవరం పూర్తి, రాజధాని నిర్మాణం, రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌళిక సదుపాయాల కల్పన వంటివి సాధ్యమన్నారు. క్షేత్రస్థాయిలో జరిగే చట్టవ్యతిరేక కార్యక్రమాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకు వెళ్లాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, ఆయన వెంట జనసేన పార్టీ నాయకులు అడపా నర్సింహమూర్తి, సయ్యపురెడ్డి నవీన్ తదితరులు ఉన్నారు.



వడ్డాది వెంకన్నను దర్శించుకుంటున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



తురువోలులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చీడికాడ, మార్చి 22 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు విచ్చేసిన కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. అర్జునగిరి, తురువోలు, చీడిపల్లి, చుక్కపల్లి గ్రామాల్లో వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి.నారాయణరావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాగేలా ప్రజలంతా సహకరించాల్సిందిగా కోరారు. ఆయా పార్టీల నాయకులు ప్రచారాలు చేసేటప్పుడు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు సెక్టార్ అధికారుల నియామకం

రోలుగుంట, మార్చి 22 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 43 బూత్‌లకు సంబంధించి సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులను నియమించారు. సెక్టార్ అధికారులుగా బి.ఉమామహేశ్వరుడు, ఆర్.రాజేశ్వరరావు, జి.శివకృష్ణ, ఎస్.దుర్గబాబు, పోలీసు సెక్టార్ అధికారులుగా డి.ముత్యాలనాయుడు, ఎస్.కృష్ణ, ఎం.రమణ, ఎ.రవీంద్ర నియామకమయ్యారు. ఆయా అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ, సోషల్ కమ్యూనిటీ, పొలిటికల్, లా అండ్ ఆర్డర్ తదితర విధులను నిర్వహించనున్నారు.

'శిక్షణ తరగతుల ద్వారా నైపుణ్యాభివృద్ధి'



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సత్తిబాబు

బుచ్చెయ్యపేట, మార్చి 22 : ఆర్థిక లక్ష్యాలు, ఆదాయాన్ని సాధించడమే జీవనోపాధి నైపుణ్యాల శిక్షణ ఉద్దేశ్యమని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ అన్నారు. విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ యువతకు నైపుణ్యంపై ఏడు రోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసి సందర్భంగా సర్టిఫికెట్లు పంపిణీ చేసి మాట్లాడారు. జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం తదితరాలను శిక్షణ ద్వారా పొందవచ్చునన్నారు. విశాఖ ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎన్.సత్తిబాబు, కిశోర్‌కుమార్, సౌజన్య, బాబులతో పాటు గ్రామీణ యువత పాల్గొన్నారు.

నిండుగొండ వద్ద అదుపు తప్పిన ట్రాక్టర్



రోడ్డుపక్క తుప్పల్లోకి దూసుకు వచ్చిన ట్రాక్టర్

రోలుగుంట, మార్చి 22 : మండలంలోని నిండుగొండ వద్ద శుక్రవారం ఉదయం ఓ ట్రాక్టర్ అదుపు తప్పింది. స్థానిక కంచుగుమ్మల ఇటుకల బట్టీ నుంచి ఇటుకల లోడు వేసుకుని నిండుగొండ మీదుగా ట్రాక్టర్ వెళుతుండగా, నిండుగొండ- ఎన్.కొత్తూరు మధ్యలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న తుప్పల్లోకి దూసుకుపోయింది. వెంటనే డ్రైవర్ అప్రమత్తమై దూకేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ముందు భాగం దెబ్బతింది.

నిరుపయోగంగా ఆర్‌బీకే భవనం



గునుపూడిలో నిరుపయోగంగా ఉన్న భవనం

నాతవరం, మార్చి 22 : గునుపూడిలో రైతు భరోసా కేంద్ర భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోక పోవడంతో పరాయి పంచన సిబ్బంది ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో నాలుగేళ్ల క్రితం ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇన్నాళ్లూ నత్తనడకన పనులు సాగాయి. ఎట్టకేలకు గత ఏడాది సెప్టెంబరులో భవన నిర్మాణం పూర్తయ్యింది. అయినప్పటికీ ప్రారంభించలేకపోయారు. ప్రతి నెలా వేలాది రూపాయలు అద్దె రూపంలో చెల్లించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. దీనిపై మండల వ్యవసాయ సహాయధికారిణి సహితను వివరణ కోరగా, తమకు ఇంకా పూర్తయిన రైతుభరోసా కేంద్రా భవనాన్ని అప్పగించలేదన్నారు.

'ఉపాధి పనుల మస్తర్లలో తేడాలు సహించం'



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

మాకవరపాలెం, మార్చి 22 : ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనుల్లో మస్తర్ల విషయంలో తప్పులు దొర్లితే సహించేది లేదని ఎంపీడీవో చంద్రరావు హెచ్చరించారు. జి.గంగవరం రాయపురాజు చెరువులో జరుగుతున్న పూడికతీత పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన కూలీలకు వంద రోజులు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ ప్రభుత్వం నిర్ణయించిన కూలీ రేట్లు పొందేలా కూలీలు పనులు చేయాలన్నారు. ముందుగా కొలతలు తీసుకొని, తర్వాత పనులు చేయాలన్నారు. మస్తర్ల విషయంలో సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వరలక్ష్మి, ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టండి'



చిన అప్పన్నపాలెంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట, మార్చి 22 : ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎమ్మెల్యే ధర్మశ్రీ అన్నారు. చిన అప్పన్నపాలెంలో శుక్రవారం ఏర్పాటైన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి, జడ్పీటీసీ దొండా రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు, గేదెల శేషు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడు మృతి



సత్యనారాయణ (ఫైల్)

రోలుగుంట, మార్చి 22 : టీడీపీ బుచ్చింపేట గ్రామ అధ్యక్షుడు ఉలబాల సత్యనారాయణ (60) గురువారం రాత్రి మృతిచెందాడు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ శస్త్రచికిత్స నిమిత్తం విశాఖలో ఆస్పత్రిలో చేరారు. సర్జరీ అనంతరం గుండెపోటు రావడంతో ఆయన మృతిచెందారు. సత్యనారాయణ 25 ఏళ్ల పాటు పాల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దని వినతి



ఈవోపీఆర్‌డీకి వినతిని అందిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

దేవరాపల్లి, మార్చి 22 : మండలంలోని కె.ఎం.పాలెంలో జనావాసాల మధ్య సెల్ టవర్ వేయవద్దని, తక్షణమే నిర్మాణ పనులు నిలిపివేయాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఈవోపీఆర్‌డీ నళినిని సర్పంచ్ రామకృష్ణ, పలువురు గ్రామస్థులు కలిసి వినతి పత్రం అందజేశారు. జనావాసాలకు మధ్య టవర్ ఏర్పాటు చేయడం వల్ల అనేక అనర్థాలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యను కార్యదర్శి దృష్టి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోయారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దేవరాపల్లి, మార్చి 22 : ప్రపంచ క్షయ నివారణా వారోత్సవాల్లో భాగంగా పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ వైద్యాధికారిణి డాక్టర్ సౌమ్య, పినకోట వైద్యాధికారి డాక్టర్ డి.రూప్‌చంద్‌లు క్షయ వ్యాధి సోకినవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు సదానందం, నాగేశ్వరరావు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.